# బాల వికాసం

## కరోనా శతకము

వైరము నీతో లేదుగ
వైరస్! నీ కలనమ్మవాస్తవమెరుగన్
కోరిరి ఎవ్వరు రమ్మని
దూరితివీ ధరణియందు దురిత కరోనా!

నలుగురితో కలిసింటను
కలిగున్నదె తృప్తిమీర కమ్మగ దినుచున్
చెలిమిని పనులన్నింటను
కలివిడిగా తోడుపడుటె కలిమి కరోనా!

భయమును బెదురును లేకయె
రయమున నిను తరుమదీక్ష రౌద్రత తోడన్
నయముగ నింటనె నుండిన
జయమెప్పుడు పొంది తీరు జనత కరోనా!

దక్షత కలిగినసేతక
రక్షక భటులామయమునె రయమున తరుమన్
శిక్షితులై సరకుగానక
దీక్షగ కాపాడుదురిదె తెలియు కరోనా!

పల్లెల విడి ఆనాడును
ముల్లెల మూటలగొనుచు మూకగ రాగా
చల్లంబలికరువై నే
డుల్లములను ఉగ్గబట్టి యుండె కరోనా!

నూకలు చెల్లెను నీకిక
లోకులలో నిబ్బరమ్ములుప్తమ్మగునా?
ఏకముగా ప్రజలందరు
నీకిట నుంచరు స్థలమును నిలువక కరోనా

బడుగుల బ్రతుకులు అశ్రువు
మడుగులలో మునుగు చుండ, మనసు కరుగదా!
అడుగులు వెనకేసి తిరిగి
వెడలగసంకోచపడకు వెర్రి కరోనా!



-చిమ్మపూడి శ్రీరామమూర్తి
సెల్: 9704177270

## పిసినారి

కథ

అవంతి కాపురంలో మల్లయ్య అనే వ్యాపారస్తుడు ఉండేవాడు. అతడు బట్టల వ్యాపారం చేసి బాగా డబ్బు సంపాదివచ్చాడు. భార్యా పిల్లల కన్నా డబ్బు మీదనే ఎక్కువ మక్కువ చూపేవాడు. భార్యా పిల్లల అవసరాలు కూడా పూర్తిగా తీర్చే వాడు కాదు. తన అవసరాలకు కూడా డబ్బు ఉపయోగించేవాడు కాదు. దానధర్మాలు చేసేవాడు కాదు. పిసినారి తనం చూపించేవాడు .భార్య పిల్లల ఆరోగ్యం క్షీణించిన పట్టించుకునేవాడు కాదు. ప్రతిరోజు సంపాదించిన డబ్బు మూటను తీసి, చూసి మురిసిపోయే వాడు. ఒక పెట్టెలో పెట్టి తాళం వేసే వాడు. కొంతకాలానికి ధనం మూట ఇంట్లో ఉంటే దొంగలు దోచుకుంటారే మోనని భావించాడు. అవంతి కాపురానికి సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో దాచి పెడితేబాగుంటుందని భావించాడు. ఒకరోజు ఎవరికీ తెలియ కుండా నిర్మానుష్య ప్రదేశానికి పోయాడు. ఒక గోతిని త్రవ్వి నాడు. అందులో ధనము మూట పెట్టి, గోతిని మట్టితో పూడ్చి వేసి నాడు. దానిపై కంపను వేశాడు. తిరిగి ఇంటికి వచ్చాడు. ప్రతిరోజు ఎవరికి తెలియకుండా వెళ్లేవాడు. గోతిని తవ్వి ధనం మూట చూసి, సంతోషించేవాడు. మళ్లీ గోతిలో ధనం మూట పెట్టి గోతిని పూడ్చి వేసేవాడు. కంప వేసేవాడు. ఇలా రోజు చేస్తుండగా ఒకరోజు భూమయ్య అనే వ్యక్తికి మల్లయ్య మీద అనుమానం వచ్చింది. మల్లయ్య ప్రతి రోజు ఇదే సమయానికి ఎక్కడికి వెళ్తున్నాడు. చూద్దాం అనుకుని మల్లయ్య కు తెలియకుండా మల్లయ్య వెళ్ళిన నిర్మానుష్య ప్రదేశానిక భూమయ్య వెళ్ళాడు. మల్లయ్య చేస్తున్న తతంగం అంతా దాగుండి చూశాడు. మల్లయ్య ఇంటికి వెళ్ళిన తరువాత భూమయ్య గోతి దగ్గరకు వెళ్లి, గోతి తవ్వి నాడు. మూటను తీశాడు. మూట విప్పి చూసాడు. అందులో ధనం ఉంది. గోతిని ముందటి వలె పూడ్చి, కంప వేసి ఇంటికి మూట తీసుకుని వెళ్ళిపోయాడు. ప్రతిరోజు వలే మల్లయ్య ధనం పెట్టిన చోటికి వచ్చాడు. గోతిని తోడి నాడు. మూట కనిపించలేదు. పెద్ద ఎత్తున రాగం తీసి ఏడవడం మొదలుపెట్టాడు. ఏడుపు విని, కొందరు ప్రజలు అక్కడికి వచ్చారు. జరిగిన సంగతి తెలుసుకున్నారు. ఎవరికి ఉపయోగపడని ధనము ఉంటే ఎంత? లేకుంటే ఎంత? అంటూ ధనం మూట కు బదులు బండను ఉంచి సంతోషించుమనీ పిసినారి మల్లయ్యకు చెప్పి వెళ్లిపోయారు.



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
సెల్ నెం.9441333315



## బాల గేయం
## నమస్కార సంస్కారం!

రెండు చేతులా నమస్కారం
నాడు మనసు మన సంస్కారం!
ఆచారాలకె కాదు, అందరి
ఆరోగ్యానికి ఆస్కారం! ॥రెం॥

మాతాపితరులు, గురువులకు
మాత్రమ్మే పాదాభివందనం!
ఇతరులకందరికీ ఎపుడూ
హితమైనది ఓ నమస్కారం!

ముద్దుముచ్చటలు, కరచాలనం
మురిపెంగా అగుపించినా
అంటు వ్యాధులకు ఆస్కారం!
అందుకె మంచిది నమస్కారం!

పరిసరాల పరిశుభ్రతనూ
పాటించటమే శ్రేయస్కరం!
ఆరోగ్యమ్మే మహాభాగ్యమను
ఆర్యోక్తిని గమనించుకో!

యోగా– ప్రాణాయామం అందుకు
యోగ్యమైనవని తెలుసుకో ॥రెం॥



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## అమ్మ మాట విందాం.!

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
కథలన్ని చదువుదాం
గేయాలు పాడుదాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
పద్యాలు చదువుదాం
చదరంగం ఆడుదాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
బొమ్మలు గీసేద్దాం
కంప్యూటర్ ఆడుదాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
సామెతలు విందాం
క్యారమ్స్ ఆడుదాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
చిట్టి కవితలు చదువదాం
వైకుంఠపాళీ ఆడుదాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
రేడియోను విందాం
పజిల్స్ ఆడుదాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
కబుర్లు ఆడుదాం
కలసి,మెలసి ఉందాంల

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
పరిశుభ్రత పాటిద్దాం
కరోనాను తరిమేద్దాం

అమ్మ మాట విందాం
ఇంటి పట్టునుందాం
వేళకు భోంచేద్దాం
హాయిగా గడుపుదాం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## బాల్యం

ముగ్గులమ్మ ముగ్గులు
సంక్రాంతిముగ్గులు
రంగుల ముగ్గులు
రతనాల ముగ్గులు
అందాల ముగ్గులు
సీతమ్మ ముగ్గులు
భూ మాత రగ్గులు
రాముని ఎగ్గులు
బుగ్గల మీద సిగ్గులు

×

ఒకటి రెండు మూడు
ఆకాశాన చుక్కలు చూడు
నాలుగు ఐదు ఆరు
కుందేలు కొమ్ము చూడు
ఏడు ఎనిమిది తొమ్మిది
ఏనుగు తొండం చూడు
పది పదకొండు పన్నెండు
పందిట్లో పెళ్లి చూడు
పదమూడు పద్నాల్గు పదిహేను
పందెం కోళ్లు చూడు
పదహారు పదిహేడు పద్దెనిమిది
పరుగు పందెం చూడు
పంతొమ్మిది ఇరువై
పంతులు వచ్చే చూడు.

×

కొండ మీది కోతులు
మా ఊరి బాలలు
సహస వీరులు
చూపిస్తారు చుక్కలు
ఆడుతారు ఆటలు
పాడుతారు పాటలు
చదువుల్లో ఘనులు
వల్లిస్తారు ఎక్కాలు
చేస్తారు లెక్కలు
విప్పుతారు చిక్కులు
పొందుతారు మెప్పులు

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## మేం చస్తే మా శవాలన్నా ఊళ్లకు తోల్తరా!

మా నాన్న ఎప్పుడూ అనేవారు
లంకెప్పుడూ అయోధ్య కాదని
నాకర్థమయ్యేది కాదు
అది అర్థమయ్యేనాటికి ఆయన లేరు
చెరువులో చేపపిల్లల్లా
మనుషులు ఈ భాగ్యనగరంలో ఈదులాడాలని
నిజాం స్వప్నించాడంటారు
అలాగే మేం ఈదులాడుతున్నప్పుడు
ఒక్కసారిగా మా వేళ్ళని పీకి పడేశారెవరో
మనిషి పొడే గిట్టకుండా పోయింది
ప్రతి మనిషీ రోగాల పుట్టనుకున్నప్పుడు
దూరం జరగాల్సి వస్తోంది
గుండెలపై చేతులు వేసుకొని
నిర్భయంగా నిద్రపోయి ఎన్నాళ్ళయిందో
పనిలేదు, పనికి పిలిచే నాధుడు లేదు
చేతిలో చిల్లిగవ్వ లేదు
దాచుకున్న పదో, పరకో
కూటి మెతుకులకే ఖర్చయిపోయింది
ఉన్నట్టుండి ఎవరో వస్తారు
లెండి, లెండి, రండిరండి అంటూ లేపుతారు
అన్నం పొట్లాలనో, బియ్యమనో, మరోకటనో అంటారు
మేమందరం నిజంగా ఎగబడతాం
పోలీసులొస్తారు, క్యూ అంటారు,
ఎడంగా నిలబడమంటారు
మా ఖర్మని మేం తిట్టుకుంటూ నిలబడతాం
బండిరానే వస్తుంది
మా కళ్లను తోరణాలుగా చేసుకుంటాం
మాచేతులు చాచినట్లే ఉంటాయి
సగంమందికైనా ఇస్తారో లేదో బండెళ్లిపోతుంది
మా బతుకులిట్లా కాలుతున్నాయని
వట్టి చేతులు నలుపుకుంటూ వెనక్కి తిరుగుతాం
ఇంతకాలం చేతులు కలిపి పనిచేసినవాళ్లం
ఇపుడు కలవకూడదంటే దూరంగా ఉంటున్నాం
పండగలకు, పబ్బాలకు డబుల్ చార్జీలు వసూలు చేసి
బస్సులు నడిపిన కొడుకులు
ఇప్పుడు కిమ్మనరు, రమ్మనరు
రైళ్ళు లేవు, బస్సుల్లేవు
పశువుల్లా కుక్కి నడిపిన ఆటోల్లేవు
మా ఊళ్లకు మేం పోలేం
ఎండిన డొక్కల్తో ఇక్కడ తిరగలేం
నీ బాంచన్ కాల్మొక్తా దొరా!
మేం చస్తే మా శవాలన్నా
ఊళ్లకు తోల్తరా!



- చీకోలు సుందరయ్య
సెల్: 9030000696

## పనితనం- ప్రాధాన్యం

మంచి మంచి శిల్పాను బొందపెట్టి, మనకు నచ్చిన వస్తువుల్నే నెత్తిన పెట్టుకుని ఊరేగుతాం. వస్తువులే ముఖ్యమని భ్రమిస్తాం. మంచి వస్తువులు విలువైనది కావని ఎవరంటారు? అయితే మంచి వస్తువుల్ని కలిగి వుండటం మాత్రమే సరిపోతుందా? నేను మాట్లాడుతున్నదంతా అర్థంపర్థం లేని అసంబద్ధ అసందర్భ ప్రసంగం అనిపించవచ్చు మీకు. కాని, ఏం మాట్లాడుతున్నానో తెలిసే మాట్లాడుతున్నాను.

సరిగ్గా తయారు చెయ్యాలే కాని, శిల్పాలు నిజంగా ఎంత బాగుంటాయి. నేనైతే బాగున్న శిల్పాల మీద మనసు పారేసుకుంటాను. అందరూ అట్లానే చెయ్యాలని ఆశ పడుతుంటాను. శిల్పాలను చిన్నచూపు చూడటం నేను భరించలేని విషయం.

పనితనం అవసరం లేదనుకునేవాళ్లను ఓ నమస్కారం. పనితనంలోని పసను గుర్తించేవాళ్లను ప్రణామం. మంచి శిల్పాలను తయారు చేయటానికి పనితనమేగా కావలసింది! మంచి శిల్పాలను చెక్కేవారిని మనసారా అభినందిస్తున్నాను.

మంచి వస్తువులను మంచిగా ప్రదర్శించినప్పుడే కదా ఆ వస్తువుల గొప్పతనం. ద్విగుణీకృతమయ్యేది? అంతిమంగా చెప్పేదేమంటే 'వస్తువు' మాయలో పడి 'శిల్పాన్ని నిర్లక్ష్యం చేయొద్దు.



- ఎలనాగ
సెల&: 8884463042

## ఓ.... అల్లరి పాపాయి

అనగనగా ఓ చిన్నారి..
చేయదు మామూలు అల్లరి..
అమ్మంటే తనకు ఎంతో ఇష్టం...
డ్యూటీకెళ్తే ఉండడం కష్టం..
అమ్మ డ్యూటీకి తయారయ్యే..
చిట్టి మనసులో గుబులయ్యే..

అమ్మ తనను వదిలేసి
డ్యూటికెళ్తుందనే కోపంతో
అలిగి మారాం చేసింది...
ఇంట్లోఉన్న వస్తువులను
చిందరవందర పడేసింది....

చిన్నారి అల్లరిని చూసిన అమ్మ
ప్రేమతో బుగ్గపై ముద్దెట్టే...
అమ్మ పెట్టిన ముద్దులు
చిరు మోములో విరిసెను నవ్వులు...

సంతోషంతో ఆ పాపాయి
అమ్మను గట్టిగా హత్తుకొని..
అమ్మ ముద్దుకు బదులిచ్చే
డ్యూటీకెళ్ళమని సెలవిచ్చే....

-రాచర్ల శ్రీనివాస్
9704246125

## ఉంటుందోయ్...

బడిలో చదువు
భవిష్యత్తుకు నెలవు
ఆదివారం సెలవు
ఉంటుందోయ్ ఉంటుంది

బడిగంట పిలుపు
భవితకు మలుపు
మల్లెకు తెలుపు
ఉంటుందోయ్ ఉంటుంది

అక్షరంతో ఉపకారం
పంతుళ్ళ సహకారం
గుర్తుండు చరకాలం
ఉంటుందోయ్ ఉంటుంది

బలపంతో బంధం
పలకతో అనబంధం
స్నేహితులతో సంబంధం
ఉంటుందోయ్ ఉంటుంది



-కొప్పోలు యాదయ్య
9494273703

## కనబడుట లేదు

చిట్టి పొట్టి పిల్లల
చేతుల్లో అందంగా
ఒదిగి పోయే ఆనాటి పలకను
ఎవరెత్తుకెళ్ళారో ఏమో?

నల్లని బొగ్గు మిశ్రమంతో
తుమ్మెద రెక్కల్లాంటి మేని రంగును
సంతరించుకొని
మిసమిసలాడే దాని రూపాన్ని
కళ్ళారా చూసి ఎన్నాళ్ళైందో?

నాల్గు గోడల నడుమ
గురుశిష్యుల మధ్య ఏర్పడే
పవిత్రమైన బంధానికది
నిజమైన వారిదిగ నిబడింది

బక్కచిక్కిన దేహంతో
ఒంటికాలిపై నడిచే తెల్లరంగు చొక్కను
తొడిగిన బలపాన్ని వెంటేసుకొని
రోజంతా హుషారుగా తిరిగేది

నేటి బాలలే
రేపటి భావి భారత పౌరులయ్యేందుకు
అది నేర్పిన అక్షరాలు
జీవితంలో దారి చూపిన మైలురాళ్ళైనాయి

కాలగమనంలో ఉన్నట్టుండి
శాస్త్ర విజ్ఞానం పెరిగే కొద్ది
నిర్లక్ష్యానికి గురైన పలక
అలక బూని ఎటెళ్లిందో ఏమో?

మీ కెవరికైన దాని జాడ తెలిస్తే
కష్టమనుకోకుండా
నాకు కాస్త కబురిస్తారా?

మరొక్కసారి దానితో నాకున్న
అనుబంధాన్ని గుర్తు చేసుకుంటు
ప్రేమతో గుండెకు హత్తుకొని
రెండు కన్నీటి బొట్లను
చెక్కిలి పైనుండి జారవిడుస్తూ
బహుమానంగ అమ్మ ఇచ్చిన
ట్రంకుపెట్టెలో
పదికాలాపాటు పదిలంగా దాచుకుంటాను!!



– జవేరియా
9849931255

## బాల్యం

తల్లిదండ్రులతో సంతోషంగా గడపాల్సిన బాల్యం నేడు వీధుల పాలు అయినది
పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన బాల్యం రోడ్డు మీద ఆటల పాలైంది
ముద్దు మురిపాలతో గడపాల్సిన బాల్యం చెత్తకుప్పల పాలైంది
అల్లరి పనులతో గడపాల్సిన బాల్యం నడిరోడ్డు మీద బిచ్చగాళ్లను చేసింది.
స్నేహితులతో ఆటపాటలతో గడపాల్సిన బాల్యం ఒంటరివాన్ని చేసింది
ఆనందంగా ఉన్నత శిఖరాలకు నిచ్చెన వేయాల్సిన బాల్యం
బాల కార్మికుల చేసింది
చిలిపి చేష్టలతో గడపాల్సిన బాల్యం కర్మాగారాలకు అంకితం
అందుకే ప్రతి ఒక్కరికి విద్యావకాలు కల్పించాలి
బాల కార్మిక వ్యవస్థను రూపుమపాలి



-అనిత దావత్
9394221927

## పెద్దల సలహా పాటించు

పిల్లలారా పిడుగుల్లారా
రేపటి భారత పౌరుల్లారా
మందే లేని రోగం కరోనా
ప్రపంచమంతా హైరానా
చేతులు శుభ్రం చేసుకుని
నోటికి మాస్కు వేసుకుని
స్వీయ రక్షణ అనుసరించు
ముందు జాగ్రత్త అవలంభించు
జ్వర లక్షణం సోకిందా
దగ్గు జలుబు నీకుందా

నిర్లక్ష్యాన్ని విడనాడు
వైద్యుని వద్దకు పరుగులిడు
ఇంటి బయటకు రావద్దు
వీధుల వెంట తిరుగొద్దు
కరచాలనం అసలే వద్దు
నమస్కారమే ఎంతో ముద్దు
పెద్దల సలహా పాటించు
కోవిడ్ వ్యాప్తిని నిర్మూలించు



- రజిత కొండసాని
9652838920

## గురువుల్లార!!

ఓహో గురువుల్లారా
మీకు మా వందనాలు

మట్టిముద్దలాంటి మాకు
క్రమ శిక్షణ నేర్పినారు
కనిపించేడి దైవాలు
మా గుండెల్లో కొలువైతిరి

అజ్ఞానమనే చీకటి
పారద్రోలే జ్ఞానులు
ఏమిచ్చి తీర్చగలము
గురువుగారి ఋణబంధము

అమ్మ నాన్న కంటె మేము
మిమ్ములనే ప్రేమిస్తము
మంచి మనసు గల గురువులు
మీకు మా దండములు

బతుకంటే తెలియజెప్పి
భవితకు బాట చూపిరి
బడి అంటే మా గుడి
గుడి లోని దైవాలు మీరు

పేద బీద వారము
దిక్కు మొక్కు లేనోళ్లము
కూలిచేసే అమ్మనాన్న
గురువునే పూజింతురు

ఎంత ఎత్తు కెదిగిన
ఒదిగుండాలని చెబుతరు
సదువు సంధ్య జెప్పి మమ్ము
సవ్యసాచులను జేసిరి

జీవితమనే పోరాటం
తెలియజెప్పిన ధీరులు
వినయంగా ఉండాలని
వివరించిన వీరులు

ఎక్కడున్నగాని మేము
మిమ్ములను మరువము
మీకు మేము పెడుతున్నము
కోటికోటి దండములు



-యాదవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

## లేత మనసులు

కమ్మని భావాలకు కోవెల బాలలు ఐతేనే
మోడు బారిన గుండెల్లో వసంతము విరిసేది
శృతిమెత్తని బావాల పొదరిల్లు లేత మనసులు

కోటి ఆశల సోయగాలు గుండెల్లో కొలువు ఐతేనే
అల్లి బిల్లి చేష్టలతో ఆకాశానికి నిచ్చెన వేసేది
అరవిచ్చిన మదురమైన ఊహల లోగిలి లేత మనసులు

ముద్దు ముద్దు మాటల ఊటల తేనెలు బాలలు ఐతేనే
బాధలు నిండిన గుండెలు కూడా సేద తీరేది
వసంతపు సమీరపు వెలుగుల లోగిలి లేత మమసులు

ఎగిసేటి కేరటములా వినీల ఆకాశములో దూసుకెళితేనే
ఏన్నో శాస్త్రీయ ఆవిష్కరణలు పుడమిపై వెలిసేది
ఆలోచనలకు అందని అద్భుత శక్తులు లేత మనసులు

-ధనాశి ఉషారాణి

## విశ్వాస ప్రకటన

కోటలు కట్టాను
కోటిమంది సైన్యాని2్న కాపలాపెట్టాను
ఆకాశ హార్మ్యములో
అందనంత ఎత్తులో ఉన్నానిప్పుడు!
సంద్రాలమధ్యలో
సమవర్తి రాలేని చోటులో
ఒంటిస్థంభం మేడపై
"చల్లగా"గా ఉన్నానని నా ధైర్యం!
కానీ ఏదో తప్పు జరిగింది
నా" స్వార్థం "చేసిన తప్పులు
ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి!
మట్టిని మసిచేసాను
చెట్టును మట్టు బెట్టాను
పిట్టను పొట్టను పెట్టుకున్నాను!
నాగరికత కోట ద్వారానికి
లక్షల మూగజీవుల శిరస్సులను
వ్రేలాడదీసాను!
నీలినింగికి తూట్లు పొడిచాను
నేలతల్లికి గాట్లు పెట్టాను
కోట్లుతప్ప...ఆరోగ్యసౌభాగ్యం
నా కప్పుడు కనబడలేదు!
తప్పు తెలుసుకొని మేల్కొనే లోపే
వాయువేగమై "వైరస"ఒకటి
దేశలనుచుట్టి
దేహాలకుప్పలుగా పోస్తుంది!

ఓ నిర్ణయానికి వచ్చాను
కోటలు,కోట్లు నన్ను రక్షించవని
ఓ "గీతారహస్యాన్ని"తెలుసుకున్నాను!
నా శత్రువు నా నేత్రాలకు చిక్కడు
దొరికానా నా సోదర సమూహంపై
నన్నే అస్త్రంచేసి కబళిస్తున్నాడు!
ఇప్పుడే
విశ్వాస ప్రకటన చెయ్యాలి
గ్రహాలనేలిన వాడను
ఇలాంటి "దుష్టగ్రహాలు"నన్నేంచేస్తాయి?
ఇల్లే నాభద్రతావలయం
ఇల్లే నా ఆరోగ్యనిలయం
తలుపులే నారక్షక భటులు
గోడలే నాకుఅభయ హస్తాలు
ఈ జాలిలేని క్రిమిని తిరిగి గాలిలో
కలిపేదాకా...ఇల్లే ఇంద్రపురి
ఈ మృత్యుఘడియలు దాటే వరకు
తరువాత నేనేంజేస్తానంటారా?
మొక్కనై మొలుస్తాను!
కిలకిలారావాల వేదికై నిలుస్తాను!!



-కిలపర్తి
దాలినాయుడు



## కరోనా సామెతలు ...

కావురం ఎక్కువై కాలవుతల వెడితే...కరోనా వచ్చి పెయ్యంత పునికిందట

కరోనా ఉంటే క్వారంటైన్ తప్పదు
ముదిరిందంటే ఐసోలేషన్ తప్పదు

కరోనా వచ్చి కాలంజేస్తే
కోట్లున్నా కాటికెవరూ రారు

కారోనాకు కాటేసుడే తెల్సు
బీద, గొప్ప తేడాలు లేవు

వద్దన్నా వాలంచి బైటికివోతే
సావుకు బయానా వెట్టినట్లే...

చెప్పుకుంటే మానంబోతదని
కరోనాను దాచుకుంటే పానంబోతది...

దిక్కువాండ్ల రోగం
దునియ మొత్తం పీనుగుల కొట్టం...

కారోనాకు ఎదురువోతనంటే
కరువకుండ ఉంటదా

కరోనా వచ్చి నిన్ను తగిలినా
నువ్వు కరోనాను తగులుకున్నా
నష్టం నీకే కాదు..నీకుటుంబానికి,సమాజానికి

పోలీసోళ్లు కన్నెర్ర జేత్తుంద్రనుకోకు...
కరోనా కౌగిలికి చిక్కకుండా
కంచెలా కాపాడుతున్నరు..

తలెంటికలంత బలగమున్నా...
కరోనాతో సత్తే కాటికెవరూ రారు...

కన్న కొడుకే కదా అని కరోనా వచ్చినోడి
కన్నీళ్ళు కూడా తుడవలేవు...

చేతెంగిలి మూతెంగిలే కాదు
కాకెంగిలైనా చాలు అంటది కరోనా...

శుభ్రంగా లేని చేతులు నీవే అయినా...
నీ పంచేంద్రియాలకు శత్రువులు...

గజం దూరం పాటించకపోతే
గాలిదుమారంల గడ్డికుప్పకు నిప్పువెట్టినట్టే...

కుంటిసాకుల పైత్యానికి
లాఠీయే శొంఠికొమ్ము ...

-మాధవ్ గుర్రాల
94926 48887

## కరోనాను ఎత్తులతో చిత్తు చేద్దాం

ఎల్లలు చెరిపిన ప్రపంచీకరణకే సవాళుగా..
తిరిగి సరిహద్దుల్లో కంచెలు మొలిచాయి
తన ఆజ్ఞలేనిదే చీమైన కుట్టదని మీసం మెలేసిన..
అహంకార నరులనే ముప్పుతిప్పలు పెట్టి..
మున్నూరు చెరువుల నీళ్ళ తాగిస్తూ..
ముక్కూచెవులు పిండి, నోటికి తాళం వేయిస్తూ..
కట్టగట్టి గూట్లో ఓ మూలన గోడ కుర్చీ వేయించి..
గర్వభంగం చేసింది తలతోకా లేని అల్పప్రాణి !

కరోనా కల్లోలానికి కంపించింది సమస్త లోకం
తిరగడమే మరిచింది ప్రపంచ జీవన భ్రమణం
అతుకుల బతుకు బండి సడుగు విరిగింది
నష్టపుటేరుల రుచి చూసింది స్టాక్ మార్కెట్లు
ఉద్యోగ ఉపాధిని మింగి ఆకలి కటకటలు
తెగిన నిత్యవసరాల సరఫరా గొలుసులు
బడుగు రైతు కాయకష్టం విపణికి చేరక..
కళ్లాల్లో కుప్పలన్నీ కన్నీటి వరదల పాలు !

నరజాతి వానర చేష్టలకు చరమగీతం పాడి..
ప్రకృతితో మమేకమే పరమోత్కృష్ట ధర్మంగా..
జీవనోపాధి కన్న ప్రాణమే ప్రధానమంటూ..
కరోనా ఆటలు సాగవని కట్టి పడేస్తూ..
తిమిరాన్ని తొలగించేందుకు సమరం చేస్తూ..
దేశం ఒక్కటై..రేపటి ఆశాదీప పుంజమై..
ఐక్యతాస్ఫూర్తితో సమరశంఖం పూరించి
కరోనా కోవిడ్‌లను ఎత్తుగడలతో చిత్తు చేద్దాం !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

### నమ్మలేని నిజాలు

స్వదిక్బంధం
ఆయువు రక్షాకౌచం
నేటి నినాదం

ఛాయ చీకటి
వెలుతురు తోకలు
అర్థం జీవార్థం

గుర్రం గాడిద
జాతిని బట్టి పీఠం
జనజాతికి?

నవగ్రహాలు
ఉగాది చదరంగం
రాశుల గమ్యం

విర్ర వీగడం
స్వతాహాగ కూలడం
యవ్వన ధీమా!



- రేడియమ్
సెల్: 9291527757

### శ్రీనిజాలు

మన పాలిటీ కరోనా
మాయరూపమెత్తి!
రోజుకు రోజా తీస్తుంది
మన ఊపిరితిత్తి!

మన వెనువెంటె వస్తుంది
యమపాశమని తెలుసు!
మారమోయ్ చుట్టుకున్నా
కరోనా ఉరి గొలుసు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## యుద్ధం చెయ్యండి

యుద్ధంఒక నిత్య సత్యం
ఎక్కడయితేనేం ఎప్పుడయితేనేం ఎందుకయితేనేం
యుద్ధం అన్నది ఒక అనివార్య అగత్యం
ఊపిరి ఉన్న జనం అందరూ ఎందరో కాదు
అడ్డుగోడలు లేని జీవ పదార్థాన మూలకాలే
తలలు పైకెత్తి సర్వం
ఆపై వాడి అధీనం అనుకునే వారు
వాళ్ళూవీళ్ళూకాదు ఒక దారానికి ముడివేసిన మువ్వలే.
యుద్ధంలో సమిధలై
ఒక వెలుగు వెలిగి వెలి బూడిదగా మారాక
చిరు జల్లు ప్రవాహంలో కరిగి
పచ్చనిపైరు బాటలై మొలిచేదంతా ఒక్కరే.
ఎక్కడైతేనేం ఎవరికైతేనేం కన్నీళ్ళు ఉప్పనివే
ఎంత రెప్పల వెనక దాచుకున్నా ఎర్రెర్రగా ఒప్పనివే

నేనూ నా లోకం అనుకున్నన్నాళ్ళూ ఎవరికీ నప్పనివే
ఎవరికి వారు ఒక ద్వీపం అనుకున్నంత వరకూ
ఎవరికి వారు ఈ పచ్చదనం, ఈ నదులూ
ఈసముద్రాలూ ఈ నింగీ ఈనేలా
నాది అనుకున్నంత వరకు
యుద్ధాలు తప్పవు.
ఒంటరి సైనికులై ఎంత యుచేస్తే మాత్రం
అంతం ఎక్కడ?
యుద్ధం చేసె ముందు కాస్త ప్రేమను నాటుకోండి

యుద్ధంచేసె ముందు నలుగురిని వెనుకేసుకోండి
యుద్ధాలు చెయ్యండి మనిషిలో ఒదిగి ఉన్న
రాక్షసత్వంతో
యుద్ధాలు చెయ్యండి
కళ్ళ వెనకాల వడ్రంగి పిట్టలా మాటి మాటికీ పొడిచే
అసూయా ద్వేషాలతో
ముందు ఎవరితో వారు యుద్ధాన్ని గెలిచాక కదా
అప్పుడు కదా ఎందరో ఒకరుగా కనిపించేది
మనసుకు కమ్మిన పొరలు కరిగేది.



- స్వాతి శ్రీపాద
సెల్:8297248988

## వీధి బడి

వీధి బడిలో
పోలీసు పంతుళ్ళు
గుంజీలుతీయిస్తున్నారు
బెత్తంతో చావబాదుతున్నారు.
కొత్త కొత్త శిక్షలను
కఠినంగా అమలుచేస్తున్నారు .
ఇంతకీనేరమేమిటో
తెలుసా !
రావద్దని సెలవులిచ్చినా
వీధిబడి బాట పట్టడమే
ఇంటిపట్టునే వుంటే
పరీక్ష రాయకపోయినా
పై తరగతికి విద్యార్థి వెళ్లే

వెసులుబాటు కూర్చినా
పిల్లచేష్టలతో రోడ్డెక్కడం
కొందరు పెద్దలకే
ప్రమాద హేతువు.
వీధి బడికివెళ్ళద్దు.
అమ్మ లాంటి ఇల్లే
ఇప్పుడు అన్నీను.
భోజన పథకాలైనా,
ఆటపాట తరగతులైనా

అన్నీ-
గడపదాటకుండానే -

వీధి బడులు
ఇప్పుడు
పోలీసు పంతుళ్ళవి
వాటి శుభ్రత పని
పారిశుద్ధ్య కార్మికులది
మనిషి రోడ్డున పడితే

ఇప్పుడు
క్రిమి కబళిస్తుందనేదే
ప్రాథమిక విద్య.
పలక లేక
భౌతిక దూరం పాటించడమే
మౌలిక జ్ఞానం.
ఆరోగ్యం వీధి పాలు కాకూడదు.
కవి భిషక్కు వైద్యుడే
ప్రాణాల పాఠాలు బోధిస్తాడు
.
ఇపుడు అందరికీ
పరీక్షా సమయమే
బడి లో మ్రోగుతున్నవి

మృత్యుఘంటికలు
అందుకే
స్వీయ గృహ నిర్బంధమైన సమాధానం.
కరోనా కట్టడియే
అసలైన పట్టభద్రత.
వీధిబడి పాలుకానివాడే
విశ్వవిజేత



-సుధామ
98492 97958

## ఈశ్వరా! రక్షించు

ఓ భగవంతుడా నీవెక్కడ
అణువణువున నీవేకదా!
అంతటా నీవున్నావని
అన్ని శాస్త్రాలు చెబుతున్నవి.

సృష్టి స్థితిలయలు మూడు
చేయువాడవు నీవేనని
శిష్టులు వచిస్తున్నారు
ప్రజలు నమ్ముతున్నారు.

ఆకాశంలో ఉన్నావు
అంతరిక్షంలో ఉన్నావు
అవని అంతటా ఉన్నావు
అణువణువున ఉన్నావు

గుండెలోన ఉన్నావు
గుడిలోపల ఉన్నావు
దహరాకాశంలో నీవే
దయాగుణంలో నీవే!

బహిఃప్రజ్ఞవు నీవే
అంతః ప్రజ్ఞవు నీవే
ప్రజ్ఞాన ఘనుడ నీవే
సర్వజ్ఞుడ నీవే!

సర్వవ్యాపకుడనీవే
సర్వశక్తిమంతుడనీవే
మహిమాన్వితుడవు నీవే
మహాదేవుడవు నీవే.

సత్యలోకం నీదే
వైకుంఠం నీదే
కైలాసం నీదే
భూలోకమూ నీదేకదా!

అన్ని లోకాల్లో నీవే
ఓతప్రోతమయ్యావు
నీకు తెలియనిది కించిత్తు
కనిపెట్టగలదా జగత్తు?

కరోనా క్రిమిపుట్టి
గడగడలాడిస్తున్నది పృథివిని
అయ్యో దాని బారి నుంచి
అవనిని రక్షించవా తండ్రి!

ఆద్యంతాలు లేవు నీకు
అఖండ జ్యోతివి నీవేకదా!
సరిహద్దులు లేవునీకు
పరమాత్ముడవు నీవే కదా!

నిర్మలుడవు, నిరాకారుడవు
నిర్గుణుడవు, నిశ్చలుడవు
నిరుపమాన తేజోశాలివి
నిర్వచించలేని శక్తినీది!

నీవు లోకాతీతుడవు
నిజంగా శోకాతీతుడవు
మామొర ఆలకించు స్వామి
కరోనానుంచి కాపాడు స్వామి.

ప్రణవమే నీ నామం
పదే పదే స్మరిస్తున్నం
విశ్వ జనుల సంక్షేమం
వీక్షించేది నీవే కదా!

మహమ్మారి కరోనాకు మరణశాసనం లిఖించు!
ఈశ్వరా! మానవాళిని ఈక్షణమే రక్షించు!



- మసన చెన్నప్ప
సెల్:9885654381

## అజేయుడు

కంటినిండా నిద్ర
వారిని అరుదుగా పలకరించే అతిథి
అమ్మ చేతి వంట వారికి
అప్పుడప్పుడు వచ్చే ఘుమఘుమలాడే కల
కుటుంబ సభ్యుల ఆప్యాయత
వారికి ఎప్పుడో ఒకసారి ఫోనులో తవినిపించే పండుగ
మనలా ఇంటిలో నిర్భయంగా
బంధించబడలేని జీవితాలు
ఏ ఋతువులోనూ
సౌఖ్యంగా సేద దీరలేని నిత్య బాటసారులు

సరిహద్దుల్లో దేశాన్ని మింగేసె మహమ్మారితో
యుద్ధం వారి దినచర్య
కరోనాకి ముందు కరోనా తరువాత
లాక్ డౌన్‌లోనూ దేశరక్షణే వారి ఊపిరి
ప్రపంచం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను
అవకాశంగా తీసుకుని
నా దేశ సరిహద్దులను దాటితే ఖబడ్దార్ అంటూ
గుండెలను చీల్చుకుని నెత్తురై పారిన వీరత్వం
మంచు కొండలలోనూ ఘనీభవించని రక్తపు ఏరు
శత్రువులను మట్టుపెట్టే దాకా తుదిశ్వాస విడువక
పోరాడిన అజేయులు
వారి త్యాగమే మన ప్రాణాలను కాపాడే ఆయుధం.
బహుశా నా ప్రజలు అనే హక్కు
మొదట భరతమాతకి
నా దేశం అనే హక్కు
మొదట సైనికుడికే ఉంటుందేమో

మన కోసం మనం ఒక్క పోరాటమూ చెయ్యలేమా..
ఎవరి ప్రాణం వారు కాపాడుకోవడానికి
తాత్కాలికంగా సైనికులమవ్వలేమా..
మన ఇంటి ప్రహరీకి మనం పహారా కాయలేమా..
మానవ జాతిపై జరుగుతున్న యుద్ధంలో
పక్షపాతం లేని ప్రళయం ఇది
గాలి చొరబడే ప్రతి అణువులో
లిప్తకాలంలో వ్యాపిస్తున్న విషవలయం ఇది

మనిషికి ప్రాణాంతకమైన శత్రువు అయినా
పాపం సైన్యం లేని ఒంటరి పోరాటం కరోనాది

"నేను" అనే చిన్న గూడు దాటి
ప్రపంచమంతా "మనం" అనే ఐకమత్యం
అల్లుకునేలా చేసిన ఘనతీ వైరస్‌ది

స్వీయ రక్షణ మన బాధ్యత
ఏ నకరాత్మక శక్తికి
మన ఇంటిని చుట్టుముట్టే అవకాశం ఇవ్వకుండా
కొంతకాలం సంయమనంతో ఉందాం
కుటుంబానికి హామీ ఇద్దాం
మీ కోసం ఎప్పుడూ
నేను ఉంటానంటూ...



- సుజనా రాజు
సెల్: 9881496122

## వలస బతుకుల విషాదం

కరోనా
వెంటాడి వేటాది తరుముతుంటే
వలస బతుకులు
గాలిలో ప్రాణాలుగా వేళ్ళాడుతున్నాయి
నగరం పోపొమ్మంటున్న ఈ వేళ
పల్లె తల్లి రారమ్మంటోంది
అమ్మ అయ్యల కన్న ప్రేగు కదలి
అలుపు, సొలుపుల కాలి నడకన
వలసల ప్రయాణం సాగుతోంది
నాగరికం నిర్మించుకొన్న 'హైవే'లపై
బడుగు పేదల కాలిజాడలు-
నునుపు చెక్కిళ్ళ లాంటి రాచబాటల విలాసంపై
తడబడుతున్న నడకల ముద్రలు
మైళ్ళు నడిచి ఊరు చేరాలనే తపనతో
రోడెక్కిన కుటుంబాల మరో ప్రస్థానం యిదిః.
ఆకలి, దాహం అణచుకొంటూ
సొమ్మసిల్లే నిరుపేదల కడగండ్లు
నెత్తిన బరువు మోత
చంకన ఎడబిడ్డ
ఎండిన రొమ్ము కోసం వినిపించే రోదన
బుడి బుడి అడుగుల చిన్నారులు
ఎంత నడక? ఎంత కష్టం?
నోరు తడారి ఏది దారి?
ఎండ వేడిమికి కాళ్ళు బొబ్బలెక్కి
అడుగు ముందుకు పడని బడుగుల వేదన
అయినా నగరం పొమ్మంటుంటే
ఊరు పిలుస్తోంది.



- జయసూర్య
సెల్: 9440664610

# బౌద్ధంపై క్రొత్త చూపు

రెండున్నర వేల యేండ్ల క్రితం ఎండకన్నెరుగని ఒక యువరాజు మృత్యువును చూసాడు. ముసలి తనాన్ని, వ్యాధులతో మానవ జాతిపడే బాధల్ని చూసాడు. చలించి పోయాడు. వీటికి పరిష్కారమార్గం కనుక్కోవాలని తపన పడ్డాడు. తపించాడు. కొన్నాళ్ళకు అతనికి జ్ఞానోదయమయింది. సిద్ధార్థుడయ్యాడు. మానవుల్లో కలిగే దుఃఖాలన్నింటికి మూలం కోర్కెలన్నాడు. వాటిని అదుపులో పెట్టుకోవాలన్నాడు. ఆయన బోధల్ని ప్రపంచం మెచ్చి ఆమోదించింది. అనుసరించింది. వాటిని 'బౌద్ధమతం'గా పేర్కొంటూ, రాజులు దేశాధినేతలు, ప్రపంచంలోని నలుమూలలకు, తమ దగ్గరి బంధువుల్ని కూడా పంపి ప్రచారం చేసారు. ఆయన గౌతమ బుద్ధుడయ్యాడు.

1955లో జన్మించిన ఉప్పల నరసింహంగారు జర్నలిస్టు. వివిధ పత్రికల్లో పని చేసారు. 'కథావేదిక', 'నటన'లాంటి సంస్థలను స్థాపించి తన సేవలందించారు. అర్థ శతాబ్ద కాలంగా దేశంలో పని చేస్తున్న మావోయిస్టులపై ప్రశ్నల వడిసెలను విసురుతున్నారు. వారి గమ్యం, గమనంపై పునరాలోచించుకోమంటున్నారు. చలంలా మ్యూజింగ్స్ రాసి తమచేదు అనుభవాలను పాఠకులతో పంచుకున్నారు.

గత సంవత్సరం (2019)లో బౌద్ధమతంపై తాను రాసిన 36 విమర్శనాత్మక వ్యాసాల సంకలనం





"అద్దంలో బౌద్ధం". ఈవ్యాసాల్లో నరసింహంగారు పలు ప్రశ్నలను లేవనెత్తారు. పాఠకులను తమలో తాము తర్కించుకుని నిజాల్ని నిగ్గు తేల్చమంటున్నారు.

వారు లెవనెత్తిన ప్రశ్నలలో స్థాలీపులాక న్యాయంగా కొన్ని:

బౌద్ధమతం, హిందూమతం కంటే భిన్నమైన మతమా? రెండూ వేరు వేరు ధర్మాలా?

సుమారు 2500 సంవత్సరాల క్రితం, బుద్ధుడు ప్రతిపాదించిన ఈ సూత్రాలు ఇరవయ్యొక్క శతాబ్దంలో ఎంత వరకు అనుసరణీయం?

బౌద్ధం బోధించిన సూత్రాలను పాటిస్తే జరావ్యాధి మరణ క్లేశాలు తొలిగిపోతాయా?

ఆయన బోధించిన "అష్టాంగ మార్గం"తోఎంత వరకు తృష్ణను జయించగలుగుతాము?

వైరాగ్యం-నిస్సంగత్వం, నిస్తేజానికి నిర్వీర్యానికి దారి తీస్తుంది. వైర్యాగం వల్ల కలిగిన ఈ దుష్పరిణామాలని ఎదుర్కోవటం ఎలానో చెప్పలేదు. నరసింహంగారి ఈవ్యాసాలు, ఆలోచనాశీలురైన పాఠక సామాన్యుల్లో కచ్చితంగా ప్రశ్నల అలల్ని రేపుతాయి.

బౌద్ధం నేడు వక్రమార్గం పట్టిందారు వ్యాసకర్త (అధ్యాయనం పేజి.38) వర్తమానంలో బౌద్ధం ఓదగా అంటారు. (అ. పే.41). బౌద్ధమత ప్రవర్తకులంతా కాషాయం ధరించి శిరోముండవం చేసుకోవాలి కద! మరి మనకు శిల్పాల్లో కనిపించే బుద్ధుడికి ఉంగరాల జుట్టు ఉంది ఎందుకు? (అ.పే.60) అని ప్రశ్నిస్తారు. శ్రీ లంక థాయ్‌లాండ్,బర్మా, టిబెట్ లాంటిదేశాల్లోనే బౌద్ధం క్రమంగా క్షీణిస్తున్నదంటారు.

14వ అక్టోబర్ 1956 ప్రముఖ రాజ్యాంగ సృష్ట. రాజకీయ వేత్త శ్రీ బి.ఆర్. అంబేద్కర్ నాగపూర్‌లో జరిగిన ఒక పెద్ద సభలో దాదాపు 5 లక్షల మంది దళితులతో పాటు తాను కూడా బౌద్ధమతాన్ని స్వీకరించిన సంగతి ప్రస్తావిస్తూ బౌద్ధం బోధించే కుల నిర్మూలన (అనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్ సిస్టం). ఇంకా ఒక పగటి కలేనంటారు నరసింహంగారు.

రచయిత వెలిబుచ్చిన భావజాలంతో ఎంత మంది పాఠకులు ఏకీభవిస్తారు అన్న విషయం అటుంచి ఆలోచిస్తే.. వీరి ఆలోచనలు ఈ వ్యాసాలు బౌద్ధమతారాధకులను ఆలోచింప చేస్తుంది. నేడు చోటు చేసుకొంటున్న "5 జి"నేపథ్యంలో కులం మతం ముఖ్యం కాదు. "విజ్ఞానమే ఆయుధం" అంటారు రచయిత. మారుతోన్న ఈ ప్రపంచానికి అనుగుణంగా వ్యవస్థలు వ్యక్తులు, మారాలని చెప్పటం నరసింహంగారి భావ పరిణతికి నిరిత పరిశీలనకు గొప్ప ఉదాహరణ. సంకలనానికి ఇచ్చిన టైటిల్ చాలా సమంజసంగా ఉంది. ఏ మతానికైనా నిరంతర చలన శీలన, పరిశీలన, అనుసరణ ముఖ్యం.

ప్రతులకు:
వుప్పల నరసింహం
జ్ఞానం పబ్లికేషన్స్
మరియు అన్ని పుస్తక కేంద్రాల్లో
వెల: 200/-
సెల్: 9985781799



- కూర చిదంబరం
సెల్: 8639335675

## గెలుపు

ఇప్పుడనిపిస్తోంది కరోనా తెచ్చిన కలవరంతో
ఏగూటిపక్షులాగూటిలో ఉంటే
ఒకే ఊళ్ళో కాకపోయినా ఒకే దేశంలో అయితే
ఎంత ఆనందం ఎంత మనశ్శాంతి !
ఆమాట అంటే నవ్వుతాడు
కన్నకొడుకు సముద్రాలకవతలనించి
రెక్కలొచ్చాక ఏగూటి పక్షులు ఆగూటిలో ఉండవని
తను చిన్నప్పుడే విన్నానంటాడు గడసరితనం ఒలకబోస్తూ
ఎంత బింకంగా వాడు మాట్లాడినా
ఆ గుండె చప్పుడులోని అలజడులు నా గుండెని చేరవా
నాలో నవ్వులు నింపాలని ఆ సమయంలో
తన భయాన్ని గుప్పెట్లో బిగించేశాడేమో
యవకుడి గుప్పిట బిగియగలదు శక్తిమంతంగా !
బిగియదు నా గుప్పిట వయసుపైబడ్డ నిస్సత్తువతో
వాడికి అడుగులు నేర్పినదాన్ని
అడుగడుగునా నడకలు సరదిద్దినదాన్ని
ఖాళీ గుప్పిట్లో ఏముందో చెప్పుకోమంటూ
మురిపించి మరిపించి అన్నం తినిపించినదాన్ని !
మూసిన గుప్పిట్లో కాదు అంతా అమ్మ మంచి మనసులో
మమతానురాగాల మాటల్లో దాగి ఉందని
అనుభవం చెప్పదా ఎదిగిన బిడ్డకి
అందుకే ఇప్పుడు వాడే అయ్యాడు నాకు అమ్మ !
ఏకష్టమైనా ఎక్కువకాలం ఉండదమ్మా ఈ కరోనా ఎంత
ఉప్పెనలా ఉపద్రవం చుట్టుముట్టినప్పుడు
నిలదొక్కుకుని నిలబడటం అలవర్చుకోవాలని
అలవోకగా నాకు నేర్పిన నను కన్నతల్లివి
మొదటిగురువు నువ్వే కదమ్మా నాకు అంటూ
అమ్మలా మనసుతో హత్తుకున్నాడు నన్ను !.
ప్రభుత్వాల రక్ష వైద్యుల సేవ శాస్త్రజ్ఞుల దీక్ష
సామాజిక రంగాల సాయమూ జనావళికి చేస్తున్నాయి మేలు
వచ్చేస్తోంది ఔషధం కనిపెట్టేశారుట కరోనాకి విరుగుడు
ఆ వార్తే కొండంత బలం ప్రపంచానికి
ఆశిద్దాము అంతా మంచినే పాటిద్దాము జాగ్రత్తలు అందరం
పారిపోక తప్పదు బేజారై కరోనా
కలుస్తాము మనమంతా కలవరపాటే వద్దు
రెక్కలు కట్టుకు వాలిపోనా అంటున్నవాడి మాటలే
కోల్పోయిన నా మనశ్శాంతికి ఔషధం కాదా !
అర్థమైందిప్పుడు వాడి గుప్పెట్లో ఉన్నది శూన్యంకాదు
ఎలాంటి మహమ్మారినైనా ఎదిరించి
పోరాడగల గెలుపనే అస్త్రం !



- తమిరిశ జానకి
నెం.9441187182

## సాధ్యం కానిదేముంది

అవును...
మనిషి అనుకుంటే సాధ్యం కానదేముంది
ఆధునిక సాంకేతిక ప్రగతితో
అద్భుత ఆవిష్కరణలు చేయగలడు
మోడుబారిన జీవితాలలో
వెన్నెల వెలుగులను పూయించగలడు
స్నేహసుగంధాలను పదుగురికి పంచి
నలుగురిలో నాలుకలా పరిమళించగలడు
మంచితనాన్ని మట్టితనాన్ని తట్టిలేపి
మానవత్వ దీపాలను వెలిగించగలడు
అవును...
మనిషి అనుకుంటే సాధ్యం కానిదేముంది
కంటికి కనిపించని కరోనా మహమ్మారి
యావత్ప్రపంచాన్ని ఒక చిన్న గ్రామంగా చేసి
గొలుసు కట్టుతో చుట్టూముట్టేస్తూ
కలవరపెడుతూ కబళిస్తున్న వేళ
కరోనాను మట్టుబెట్టి మట్టికరిపించాలంటే
సంకల్పబలంతోనే మనిషి సమరం చేయాలి.
అవును...
మనిషి అనుకుంటే సాధ్యం కానిదేముంది
కాలాన్ని గాయం చేసిన కాలరక్కసిని
ఇంట్లోనే వుంటూ కడదాకా తరమికొట్టాలి
కరోనా ప్రతాపాన్ని అవగాహన చేసుకుని
మూతి ముక్కులకు మాస్కులు ధరించి
కరోనాను కట్టడి చేస్తూనే అరికట్టాలి.
అవును...
మనిషి అనుకుంటేసాధ్యం కానిదేముంది
కరోనా అల్లంత దూరంలో పారిపోయేలా
వ్యక్తిగత శుభ్రతను అలవర్చుకోవాలి
అలక్ష్యం అందరిపాలిట శాపం గాకుండా
సామాజిక దూరమే అందరి ధ్యేయం కావాలి
సమైక్య భావంతో సంఘటిత శక్తితో
లాక్ డౌన్ ను విజయవంతం చేయాలి.
అవును...
మనిషి అనుకుంటే సాధ్యం కానిదేముంది
మనో నిగ్రతతో మసలుకుంటేనే
మానవసంబంధాలు పదిలమవుతాయి
సరియైన దిశానిర్దేశం వుంటేనే
ఆశల తీరాలను చేరగలరు
ఆత్మవిశ్వాసాన్ని
ఆలంబనగా చేసుకుంటేనే
జీవనమకరందాన్ని ఆస్వాదించగలరు



-పులి జమున
8500169682.

పుస్తక సమీక్షలు

# "బతుకుచెట్టు" పై పూచిన "వెన్నెల"కవిత్వం

"అష్టకష్టాల జీవితాన్ని అనుభవిస్తూ/సరికొత్త సౌందర్యలోకం/సృష్టించుకోవడమేనా/కవిత్వమంటే/ మదిసంద్రంలో పెనుతుఫాన్లు/చెలరేగుతోన్నా/ ప్రశాంతతీరం మీద పదాలల్లడమేనా/కాదు కాదు/ నిప్పుల్లో కాల్చి నిజాలకు/పుటం పెట్టడవే కవిత్వమంటే"** అంటాడు వర్థమాన కవి వెన్నెల సత్యం. కవిత్వాన్ని ఉబుసుబోక వూహలపేహలమీద రాసేవాళ్లొకరకం. కళ్లముందు కఠిన వాస్తవాలను పెన్నుకెక్కించుకుని నిబద్ధంగా కవిత్వాన్ని సేద్యంజేసే కవులు రెండవరకం. రెండవరకం సీరియస్ కవి వెన్నెలసత్యం. ఈ కవి లఘుప్రక్రియలెన్నో రాసి తన కవితాదాహాన్ని తీర్చుకుంటున్నాడు. నానీలతో ఎన్నో దృశ్యాలకు చిత్రికపట్టాడు. మణిపూసలరాశులు పోసి పాఠకపరం చేశాడు. గజల్లపై,మొగ్గలపై సిరాను ఖర్చుజేసాడు. అయినా "కవిత్వదాహం తీరనిది"కదా! ఇపుడు వచనకవిత్వంలోకి ప్రవేశించాడు. తన అక్షరాల్ని ఏర్చికూర్చి "బతుకుచెట్టు" కి పురుడుపోశాడు. అరవైమూడు కవిత్వఫలాలతో అలరారిన ఆ చెట్టుని దర్శిద్దాం!

ఆధునికకాలం అస్థిత్వాన్ని వెతుక్కునే కాలం. దళిత బహుజనులతో కవిత్వంలో ఇదివరకు లేని, గుర్తించబడని గొంతులెన్నో వినిపిస్తున్నాయి. వెన్నెల సత్యం కూడా ఈ సంపుటిలో బహుజనగొంతుక విప్పాడు. "కొలిమి నా చెలిమి" అంటూ.. మూలాలకేతనం ఎగరేసాడిలా..!

**"మండే ఆ కొలిమి ముందు/మా నాన్న కూర్చున్నప్పుడు/అపరరుద్రుడిలా కూర్చునేవాడు/ సూర్యుడొచ్చి కొలిమిలో నిప్పుల్ని రాజేసి/తను పోయేటపుడే ఆ జ్వాలనీ/తనతో పాటే తీసుకుపోయే వాడు/మండే బొగ్గులమధ్య నాన్న/చెమటనదిలా ప్రవహించేవాడు"** ఇలా సాగే ఈ కవితలో నాన్న కొలిమితనాన్ని, సబ్బండవర్ణాల పనిముట్ల తయారీలో





తన తండ్రి పనితనాన్ని చెబుతూ, నాన్న రక్తాన్ని ఆవిరి చేసిన కొలిమి నాన్నతోపాటే సమాధ య్యిందీ" అని వాపోతాడు. మరి కొలిమి చెలిమి ఎలా అయ్యిందీ.!? ఎలాగంటే నాన్న గుర్తుకొస్తే కవి హృదయం రగిలే కొలిమి అవుతుందనీ, తన అక్షరాల్లోని కాక దాని చెలిమి ఫలితమేననీ సమర్థించుకుంటాడు. కవి నోస్టాల్జియా కలవరింత ఈ పద్యం. మరోచోట వృత్తి సంబంధమైన కవితగా "ఎడ్లబండి" ని తోలుకొచ్చాడు. ఇంకో కవితలో "దాతి కాడ" బాడిసె, ఉలి, రంపం, సుత్తె, శానం, పట్టకారు వంటి వృత్తిపని ముట్లనూ అక్షరాలమధ్య పెద్దపీటవేసి కూర్చోబెట్టాడు. పైన పేర్కొన్న కవితల్లో వృత్తులు మాయమౌతున్న ఆందోళన వ్యక్తం చేశాడు. ఆనాటి శ్రామికజీవన సౌందర్యాన్ని, వైభవాన్నీ కీర్తించాడు.

సంపుటి శీర్షిక "బతుకుచెట్టు" కూడా వృత్తిబంధమైన జీవితాన్ని కళ్లకు కట్టించింది. కల్లుగీత కార్మికుని పాలిట కల్పవృక్షం ఈతచెట్టుని **"అతడి పొట్ట నింపడానికి/ అలుపెరుగక ప్రయత్నించే/ఈతచెట్టు మనిషికన్నా గొప్పది/కార్మికుడి కష్టాల్నీ బాధల్నీ/దాచుకున్నందుకేమో/ దాని దేహానికి అన్ని గరుకు గాట్లు"** అని అంటాడు. సాటి మనిషి కష్టాన్ని పట్టించుకోని దయలేని మనుషుల్ని ఈతచెట్టు బరికెలతో చెల్లుమనిపించాడు కవితసాక్షిగా..!

వెన్నెలసత్యం వస్తువైవిధ్య కవి. కంటికింపైన వస్తువునల్లా కలానికప్పగిస్తాడు. దానికి బతుకుల్ని ముడిపెట్టి సార్థకతను మేళవిస్తాడు. ఇందులోని "కర్చీఫ్" కవిత అలాంటిదే. కొన్ని పంక్తులు తడవండి.

**"పొరపాటున కన్నీళ్లొచ్చాయా/తడిచిన చెక్కిళ్లను అమ్మచేతి స్పర్శంత/సుతారంగా తుడుస్తుంది/ఎర్రటి ఎండలో నీడైనపుడు/నాన్నను తలపిస్తుంది/వానలో గొడుగైనపుడు/ అమ్మ చీరకొంగుని మరిపిస్తుంది/ఒంటరి బతుకు దోవలో/సహబాటసారిగా తోడు నిలుస్తది".** కర్చీఫ్ లో మానవగుణాల్ని దర్శించే వుదాత్తత వాక్యాలనిండా తారసపడుతుంది. "అది ఒట్టి గుడ్డముక్క కాదది/నా దేహంలో ఓ భాగమైంది" అన్నాడు. కవిలోని లాలిత్యభావన,కృతజ్ఞతాభావం తొణికిసలాడింది. ఇలాంటివే "పనిముట్టు(కత్తి)", "నులకమంచం", త్రాసు,అంబలి,ఆయుధం(దువ్వెన) వంటి కవితలూనూ..!

ముందుగా చెప్పినట్టు,కవి కఠోర వాస్తవాల్ని కూడా మాట్లాడాడు. కులమతాల మౌఢ్యాలను ఖండించాడు. ప్రణయవేదన ఖండికలో ప్రణయ్ అమృతల ప్రేమవిషాదానికి చలించీ, ప్రేమికుల చుట్టూ తన అక్షరాలను ఆయుధాలుగా నిలబెట్టి,రక్షణకవచం నిర్మిస్తానంటడు. అయినా ఈ నేలమీద కులాలు, మతాలు,వర్ణవివక్షలూ రూపుమాపుతాయనడానికి నమ్మకం దొరకదు. కవి ఆకాంక్ష నెరవేరాలనీ ఆశిద్దాం. "పాలమూరు అరిగోస" లో ప్రాంతీయదుఃఖాన్నీ, వెనకబాటుతనాన్ని,పాలమూరు పసిడినేలపై పాలకుల, కార్పోరేట్ల కన్నెలా పడిందో తల్లడిల్లుతూ, నాల్గు గుండె స్పందనల్ని వెల్లడిచేశాడు.

కవిలో సమకాలం పట్ల బాధ్యత వుంది.బడుల్లో తెలుగుపండితుల శ్రమదోపిడిని చెప్పాడు. తెలుగువెలుగు లో భావితరాలకు మనమిచ్చే వారసత్వసంపదగా మాతృభాషను నినదించాడు. అమ్మమ్మ కవితలో మానవసంబంధాల ఔన్నత్యాన్ని గొప్పగా ఆవిష్కరించాడు. ఆమె పోరాటపటిమను కొనియాడాడు. అలాగే **"అధికారం పువ్వు మీద/ గండుతుమ్మెదలై వాలి/భజన భ్రమలగీతాలు/ ఆలపించే"** కుకవుల మూతికి వాతలూ పెడతాడు. కవిత్వాన్ని శాలువాలకు బలిపెట్టే స్వార్థకవులపై అక్షరాలతూటాలు దూశాడు. బతకడం నేర్పేవాడే అసలైన కవిగా నిలబెడతాడు. ఇంకా రాజకీయ నియంతృత్వంపై సదా నిరసనను తెలిపాడు.

నిరంతరమూ కవిత్వమే శ్వాసగా బతుకుతూ కవిత్వాకాశంపై వెన్నెలవర్షం కురిపిస్తున్నాడు. లలితమైన చల్లని భావాలేగాదు నిప్పుభాషల్ని జమిలిచేసీ, బతుకు చెట్టుని పరిమళింపజేశాడు. సమాజాన్ని పట్టించుకున్న కవిత్వాన్ని అందించినందుకు వెన్నెల సత్యానికి అభినందనలు.

ప్రతులకు: వెన్నెల సత్యం
సెల్: 9440032210
వెల: 120/-



-మెట్టానాగేశ్వరరావు
సెల్:9951085760

## శబ్ద శిల్పాలు

'నిన్నటి తప్పుల్ని దిద్దుకో
రేపటికి తప్పులుండవు
నిన్నటినుంచి రేపటికిలోకి నడిచిపో
నువ్వే శిఖరమౌతావు'

– పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

## దివ్యౌషధం

ఒంటి నిండా పచ్చబొట్లు పొడిపించుకొని
కంటి తలుపులను దాటుకుని
మస్తిష్కపు మంచినీటి సంద్రం చేరడం
విజ్ఞానపు అలలతో
అజ్ఞానపు తీరాలను కూల్చడం

కదలని నిర్దయ కాలాన్ని
కమ్మని జ్ఞాపకాల తోటగా మార్చడం
చిరకాలం గుర్తుండే విహారం చేయించి
అక్షర పువ్వుల కానుకలు ఇవ్వడం

కాలమైనా,కరువైనా
ధనం వరించినా,దారిద్ర్యం వెక్కిరించినా
వీడిపోని నేస్తమై
దిగులు మేఘాలను కరిగించడం

సెల్ఫులో సేదదీరుతూ ఇంటి అందాన్ని
చేతిలో నాట్యమాడుతూ మనిషి గౌరవాన్ని
హృదయానికి హత్తుకుంటే ఆత్మవిశ్వాసాన్ని
ద్విగుణీకృతం చేసే దివ్యౌషధమే పుస్తకం.



-గంభీరావుపేట యాదగిరి
9440617611.

## జీవగీతం

తనివితీరా ఓ జీవగీతాన్ని
పాడుకోవాలనుంది
భయంతో ఎవరూ
గొంతు కలపకపోయినా
ఒక్కడినే పాడుకుంటూ
నేలంతా చుట్టిరావాలనుంది
గడ్డకట్టుకుపోయిన నిన్నటి భయాల్నీ
గూడుకట్టుకున్న విషాదాల్నీ
పదం పదంలో పేర్చి
ఓ గీతాన్ని రాసుకోవాలనుంది
ఎక్కడో తప్పిపోయిన స్వేచ్ఛ
ఎప్పుడో అదృశ్యమైన శాంతి
కలలాంటి సమానత్వం
పల్లవులై పరిఢవిల్లే పాట
గుండెల నిండుగా పాడుకోవాలనుంది
ఘనీభవించిన ప్రపంచం కరిగేలా
ద్రవీభవించి హృదయాలన్నీ ప్రవహించేలా
ఎన్నడూ వాడిపోని పువ్వులాంటి పాట
ఎప్పుడూ వొట్టిపోని పరిమళంలాంటి పాట
నేలంతా విత్తాలనుంది
జీవితాలన్నీ ఎడారైపోయేలోగా
మనుషులంతా మరబొమ్మలైపోయేలోగా
కొన్ని అరణ్యాలైనా మొలకెత్తించాలి
కొన్ని మానవతాదీపాలనైనా వెలిగించాలి
ఒక జీవగీతాన్ని
ప్రేమగా ప్రపంచంమీద కప్పి
మనిషి పొడిబారకుండా చూడాలి!



– సాంబమూర్తి లండ
9642732008

## వాక్యంలా పరుగులెత్తి

అక్షరాలు నేర్చుకున్నా
పదాల పదనిసలు పాడి
వాక్యంలా పరుగులెత్తి

కలమే కరవాలంగా
ఝుళిపిస్తూ...దడిపిస్తూ

కలమే హలముగ మార్చి
కవన సేద్యమే చేస్తూ.

కలమే మనసుగ తలచి
వలపు పంట పండిస్తూ

కలమే నా ప్రాణంగా...
కడ దాకా నిలుపుకొంటూ...

అక్షరమే అక్షయమై...
వాక్యంగా నిలవాలని...

ఆకాంక్షిస్తున్నా ఆశగ...
ఆ కాలానికై ఎదురుచూస్తూ...!!

-సుకన్య వేదం
9550611271

## మధుర వాణి

ఆడవారికి ఉండు ఎంతో ఓర్పు
వారు కష్టములను ఎన్నో ఓర్చు
ఆడవారికి సాటి లేరు జగతి
ప్రేమతో వారు మనలను మార్చు

ఆలుమగల బంధము ఎపుడు అద్భుతము
ఆలుమగల గొడవలు నీటిబుడగలు ఎపుడు
అలల్లా వచ్చిపోతూ ఉంటాయి గొడవలు
వాదులాట వద్దు ఆవేశముతో ఎపుడు

మనసెరిగిన ఆలి దొరుకుట అదృష్టము
మంచి భార్య వలన మనశాంతి ఉండు
గయ్యాళి భార్య చేయు ఘాతుకాలు ఎన్నో
గయ్యాళి వలన ఘర్షణ ఎపుడు

గుణవంతురాలైన భార్య వలన గుర్తింపు
సమాజంలో నీకు కీర్తి ఎన్నడు
భార్య ఇచ్చు నీకెపుడు స్థైర్యము
భార్య నీఉన్నతికి సోధమే ఎన్నడు

మాటవినెడి ఆలి దొరుకుట అదృష్టము
మనసెరిగిన ఆలి మకరందమే అగును
మనసులు కలిసిన మధురమా బంధము
మాటవినని ఆలి మందరయే అగును

-గొబ్బూరి. గంగరాజు
9032273064

## కనబడుట లేదు

చిట్టి పొట్టి పిల్లల
చేతుల్లో అందంగా ఒదిగి పోయే
ఆనాటి పలకను ఎవరెత్తుకెళ్ళారో ఏమో?

నల్లని బొగ్గు మిశ్రమంతో
తుమ్మెద రెక్కల్లాంటి మేని రంగును
సంతరించుకొని
మిసమిసలాడే దాని రూపాన్ని
కళ్ళారా చూసి ఎన్నాళ్ళైందో?

నాల్గు గోడల నడుమ
గురుశిష్యుల మధ్య ఏర్పడే
పవిత్రమైన బంధానికది
నిజమైన వారధిగ నిబడింది.

బక్కచిక్కిన దేహంతో ఒంటికాలిపై నడిచే
తెల్లరంగు చొక్కను తొడిగిన బలపాన్ని
వెంటేసుకొని రోజంతా హుషారుగా తిరిగేది.

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులయ్యేందుకు
అది నేర్పిన అక్షరాలు
జీవితంలో దారి చూపిన మైలురాళ్ళైనాయి.

కాలగమనంలో ఉన్నట్టుండి
శాస్త్ర విజ్ఞానం పెరిగే కొద్ది నిర్లక్ష్యానికి గురైన
పలక అలక బూని ఎటెల్లిందో ఏమో?.

మీ కెవరికైన దాని జాడ తెలిస్తే
కష్టమనుకోకుండా
నాకు కాస్త కబురిస్తారా?.

మరొక్కసారి దానితో
నాకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటు.
ప్రేమతో గుండెకు హత్తుకొని
రెండు కన్నీటి బొట్లను
చెక్కిలి పైనుండి జారవిడుస్తూ
బహుమానంగ
అమ్మ ఇచ్చిన ట్రంకుపెట్టెలో
పదికాలాపాటు
పదిలంగా దాచుకుంటాను!!



-జవేరియా
9849931255

## ఏమన్నది మనిషి మనసు ?

ఏమన్నది మనిషి మనసు ?
మనిషి మనసు ఏమన్నది ?
అధికారం,అధికధనం
తనకే కావాలన్నది !

ఏమన్నది మనిషి మనసు ?
మనిషి మనసు ఏమన్నది?
లోకంలో కీర్తంతా
తనకే కావాలన్నది!

ఏమన్నది మనిషి మనసు ?
మనిషి మనసు ఏమన్నది?
తిరుగులేని విజ్ఞానం
తనకే కావాలన్నది!

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
నూరేళ్లూ జీవించే
యోగం కావాలన్నది !

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
గ్రహాలనే జయించినా
క్రిమిని గెలువలేనన్నది !

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
అన్నీ ఉన్నా తనలో
సంతృప్తే లేదన్నది !

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
తృప్తి లేని బతుకులోన
దీప్తి రాదు రాదన్నది !

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
మరణభయం అనుక్షణం
వెనువెంటే ఉందన్నది !

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
దైవానికి సర్వస్వం
అర్పిస్తానంటున్నది !

ఏమన్నది మనిషి మనసు?
మనిషి మనసు ఏమన్నది?
తన రూపం తెలిసి నేడు
ధన్యత చెందానన్నది !



-డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.

## పుస్తకం

**ఒంటరితనాన్ని దూరం చేస్తూ జ్ఞానాన్ని వృద్ధిచేసి మంచి భవిష్యత్తును ప్రసాదించే 'పుస్తకం'పై చంచల రవికుమార్, బండారు సునీతలు రాసిన సత్యాలు..**

-సంపాదకులు

అంతరంగానికి నేస్తమై
ఆకాశానికి ఎత్తుతుంది
మస్తిష్కానికి స్నేహమై
మైమరిపిస్తుంది !

అమృత నిధిగా
అక్కున చేరుతుంది
విజ్ఞాన ఖనిగా
మేధస్సును పెంచుతుంది !

ఆకాశంలో తారలా
మెరుపునిస్తుంది
చల్లని వెన్నెలలా
సేద తీర్చుతుంది !

జ్ఞానాన్ని వృద్ధిచేసి
ప్రవర్తనను మార్చుతుంది
బతుకులు బాగు చేసి
జీవితాన్ని నిలబెడుతుంది !

కుళ్ళుతున్న మనుషులకు
ఓదార్పునిస్తుంది
ఒంటరి బ్రతుకులకు
స్వాంతన చేకూరుస్తుంది !

మోమున ప్రశాంతతను
నింపుతుంది
కల్మష మైన మనసును
మార్చివేస్తుంది !

మహానుభావుల చరిత్రను
జాతికి అందిస్తుంది
జాతి రత్నాలను
వెతికి తీస్తుంది !

తృష్ణను రేకెత్తిస్తూ
జ్ఞానాన్ని అందిస్తుంది
మేదస్సును శోధిస్తూ
విజ్ఞానంతో నింపుతుంది !

ఓపికున్నంత వరకు
ఊపిరినిస్తుంది
ఊపిరున్నంత వరకు
తోడుగా నిలుస్తుంది !

ఒంటరి తనాన్ని
దూరం చేస్తుంది
తుంటరి తనాన్ని
తట్టి లేపుతుంది !

ఆటుపోట్లను తట్టుకునేట్లు
ఆసరాగా నిలుస్తుంది
బందిపోట్లను పట్టుకునేట్లు
సమాచారమిస్తుంది !

సమాజ హితంను
కోరుతుంది
సామ్రాజ్య వాదంను
రూపు మాపుతుంది !

బోధనకు మూలమై
దిశను మార్చుతుంది
అక్షర చైతన్యమై
ఆయుధంగా మారుతుంది !

దగ్గరకు రానిస్తే
సోపతి
దూరంగా నెట్టివేసే
అధోగతి !

సమాజ హితానికి
పెన్నిధి
సమాజాభివృద్ధికి
వారధి !

ఆకలి పోరాటానికి
ఆత్మబంధువు
అభివృద్ధి పథానికి
చల్లని సింధువు !

హృదయాలను రంజింపజేసి
ఆకట్టుకుంటుంది
కలాలను కదిలించివేసి
కవితల్ని రాయిస్తుంది !

రసికుల హృదయాలను
రంజింప చేస్తుంది
యువతలోని కోరికలను
గిలిగింతలు పెడుతుంది !

కాలాలు మారినా
కనుమరుగు కాదు
అంతర్జాలమెంత భయపెట్టినా
అదరదు బెదరదు !

బహుజనులకు
భరోసాను ఇస్తుంది
అన్నదాత ఆశలకు
చేయూతనిస్తుంది !

అవినీతుల గుండెల్లో
అస్త్రమై నిలుస్తుంది
అవినీతిపరుల పోరులో
శస్త్రమై గెలుస్తుంది !

కాలాలెన్ని మారినా
కనుమరుగు కాదు
నెట్వర్కు ఎన్నొచ్చినా
చెక్కుచెదరదు !

ఆయుదంగా అక్షరాన్ని
వాడుతుంది
మార్గదర్శిగా యువతరాన్ని
నిలుపుతుంది !

అంతరంగ స్నేహమై
అంటిపెట్టుకొని ఉంటుంది
పాఠకుల నేస్తమై
పరవశింప చేస్తుంది !

అసమానతల ప్రతివాదిగా
ఎదురు నిలుస్తుంది
సామాజిక సేవకురాలిగా
సేవలందిస్తుంది !

చెమట చుక్కలలో
చైతన్యాన్ని రగిలిస్తుంది
బతుకు సమరంలో
ఆయుధమై పోరాడుతుంది !

కనపడని విశ్వాన్ని
చూపెడుతుంది
వినపడని రాగాన్ని
చదివిస్తుంది !

ఎగిసిన దుఃఖాన్ని
ఓదారుస్తుంది
మనసులోని బడబాగ్నిని
చల్లబరుస్తుంది !

పీడిత బతుకులకు
పాటవుతుంది
రౌడీ నాయకులకు
పోటవుతుంది !

అభ్యసనలను సమీకరించి
మార్పుకు తోడ్పడుతుంది
సంస్కృతిని విశదీకరించి
అందరికీ పంచుతుంది !

ప్రపంచీకరణ ఆధిపత్యాన్ని
అణచివేస్తుంది
ప్రపంచదేశాలను
ఏకం చేస్తుంది !

పురాణ గాథలతో
పురుడు పోసుకుంది
ఆధునిక సమాచారంతో
అక్కున చేరుతుంది !

మూఢనమ్మకాల సమాజానికి
అవగాహన కలిగిస్తుంది
మూఢాచార జనులకు
మంచిని బోధిస్తుంది !

ఓటమితో కృంగేవారికి
ధైర్యాన్ని ఇస్తుంది
లక్ష్యాన్ని ఛేదించేవారికి
స్ఫూర్తి నిస్తుంది !

పోటీ పరీక్షలకు
పరిపుష్టం
నిరుద్యోగ యువతకు
అదృష్టం !

అపార మేదస్సుని
నింపుతుంది
జ్ఞాన దాహాన్ని
తీర్చుకుంది !

అనేక ప్రయోజనాలను
చేకూర్చు తుంది
సకల జనులను
సమ్మోహితుల్ని చేస్తుంది !

దోపిడీ వివక్షతకు
అడ్డుకట్ట వేస్తుంది
పీడనాల తొలగింపుకు
తోడ్పాటు నిస్తుంది !

సామాజిక సంస్కరణకు
మూలమై నిలిచింది
ప్రజాస్వామ్య పరిరక్షణకు
కరపత్రమై కదిలింది !

స్వరాజ్య స్థాపనకు
సాధనమయింది
స్వపరి పాలనకు
సోపతయ్యింది !

కార్యాచరణ ప్రణాళికకు
కర్తగా నిలుస్తుంది
శిక్షణా కార్యక్రమాలకు
అండగా నిలుస్తుంది !

రాజకీయ పెత్తనాల్ని
ప్రశ్నిస్తుంది
పెత్తందారీ వ్యవస్థల్ని
పెకిలిస్తుంది !

త్యాగపూరిత జీవితానికి
తరగతవుతుంది
అవిశ్రాంత పరిశ్రమకు
ఆసరాగా నిలుస్తుంది !

అపురూప కట్టడాలకు
ఆధారమౌతుంది
చరిత్ర పుటలకు
సాక్షమై నిలుస్తుంది !

విద్యా ప్రమాణాలను
పెంచుతుంది
విద్యార్థి భవితను
కాపాడుతుంది !

అభ్యుదయ దృక్పథానికి
అక్షరాయుధమవుతుంది
వర్తమాన సమాజానికి
వెలుగు రేఖవుతుంది !

మదిలోని ఆలోచనలను
సంకలన పరుస్తోంది
మనసులోని భావనలను
జత పరుస్తుంది !

విశ్వ విజ్ఞానాన్ని
నిక్షిప్తం చేసుకుంటుంది
విషయ పరిజ్ఞానాన్ని
పంచుతుంది !

జీవితము పుటలో
విలువైన అక్షరం
బతుకు పోరులో
ఆదుకునే నేస్తం !

సామాజిక విలువలకు
సారధిగా నిలుస్తుంది
నైతిక విలువలకు
నాంది పలుకుతుంది !



– చంచల రవి కుమార్
8500330700

కదలలేని వారికి సైతం
కదిలే లోకాన్ని చూపించగలిగేవి
పుస్తకాలు ...అద్భుత నేస్తాలు..!
ఆకతాయిగా తిరిగే వాళ్లను సైతం
అంతరిక్ష పరిశోధకులుగా మార్చేది
పుస్తకాలు ..ఎవరు దోచుకోని సంపద..!
అంతర్జాలం ముసుగులో
అసలైన సంపదను మరుస్తున్నాం
పుస్తకాలు.. మనుగడకు ఆనవాలు..!
ఎంత చదివినా తరిగిపోనిది
ఫలితమెప్పుడు తియ్యగా వుండేది
పుస్తకాలు... చెరిగిపోని జ్ఞాపకాలు..!
మంచిని రక్షించమంటూ
మౌళిక విలువలను మనకందించేవి
పుస్తకాలు ...జ్ఞానప్రదాతలు ..!
కొన్ని పుటల సముదాయం
కొన్ని అక్షరాల మేళవింపు మాత్రమే కాదు
పుస్తకం.. ఒక అక్షయ పాత్ర ..!
ఎందరో మహాకవులను
మేధావులను మనకు అందించింది
పుస్తకం...విజ్ఞాన బాండాగారం ...!

ప్రపంచంలోని కష్టాలను,ఆపదలను గురించి
జగతికంతా తెలియజెప్పేవి
పుస్తకాలు ...ఖండాంతరాలకు ఖ్యాతి..!
బండరాయిలో బావాలను పలికించి
ఆణిముత్యాలుగా తయారు చేసేది
పుస్తకం ...ఒక అనితర సాధ్యం..!
సంస్కారం వ్యక్తిత్వం పెంపొందింపజేసి జన
బంగారు భవిష్యత్తు తోడ్పడేవి
పుస్తకాలు... మంచి మార్గదర్శకాలు..!
డిజిటల్ యుగంలో కూడా
అంతర్జాలంతో పోటీపడుతూ
ముందుకు సాగుతున్నాయి పుస్తకాలు ....
తరగని పెన్నిధులు..!
అంధకారం అలుముకున్న జీవితంలో
బతుకు తెరువుకై మార్గం చూపేటవి
పుస్తకాలు..దిశా నిర్దేశాలు...!
జ్ఞాన సముపార్జనకు
చక్కని సాధనాలు
సంస్కారం పెంచుకొనుటకు
అనువైన నేస్తాలు !

ఆలోచనలు పెంచి
విజయం చేకూర్చుతుంది
మంచిని పెంచి
సన్మార్గుల్ని చేస్తుంది !

ఎలా ఉండాలో
తెలియజెప్పేది
ఏమి చేయాలో
వివరించేది !

అందరి చేతుల్లో
ఉండాల్సింది
చదివినవారి మాటల్లో
వినదగ్గది !

బాలమిత్ర,చందమామ
కథలతో అలరించేది
అందరిలో పఠిమ
పెంపొందింపచేసేది !

కదల్లేనివారికి లోకాన్ని
చూపించేవి
ఆత్మీయతతో కాలాన్ని
కట్టి పడేసేది !

విద్య ఆవశ్యకత
తెలియచేసేది
మంచి,మానవత
భోదింపచేసేది !

జీవితం గురించి
తెలియ జెప్పేది
ఇతరుల గురించి
ఆలోచించమనేది !

మనలో మార్పుకు
నాంది పలికేవి
నూతన దిశకు
దారి చూపేవి !

మంచి దిశవైపు
నడిపించేది
భావి తరపు
భవితకు బాటలేసేది !



– సునీత బండారు
9440671530

## జీవిత సహచరి

నీ జీవిత సహచరిని
ఎందుకు అలక్ష్యం చేస్తావు
ఎందుకు చులకనగా చూస్తావు
జీవితాంతం నీకు సేవలందిస్తుంది
ప్రతి పనిలోనూ సహకరిస్తుంది
యాత్రలకు తీసుకెళ్ళుతుంది,
సినిమాలకు షికార్లకూ తిప్పుతుంది
ఆఫీసు పనిలో సహకరిస్తుంది
అలాంటి నీ జీవిత సహచరిని
ఎందుకు అశ్రద్ధ చేస్తావు.

నడవాలన్నా పనిచేయాలన్నా
పరుగెత్తాలన్నా పడుకోవాలన్నా
తను సహకరించకుంటే
నీవు ఏమీ చేయలేవు
నీవున్నంతకాలము తనుంటుంది
కాదు కాదు
తనున్నంతకాలమే నీవుంటవు
తను లేకుంటే నీకు చోటేదీ
అసలు తను లేకుంటే నీకు రూపెక్కడిదీ
ఎవరనుకుంటున్నావు తను?
అదే నీ జీవితాంతం సహకరించే నీ శరీరం
నీవు తనను రక్షిస్తే తను నిన్ను రక్షిస్తుంది.

తనకు నువు వ్యాయామం అందిస్తే
నీకు మంచి ఆరోగ్యం అందిస్తుంది
తనకు సమతులాహారం అందిస్తే
నీకు రోగనరోదక శక్తనిస్తుంది
నిన్ను రోగాలనుండి కాపాడుతుంది
వాటి బారిన పడినా
ఆస్పత్రినుండి ఆరోగ్యంగా కాపాడుకొస్తుంది
నిన్ను ఎల్లవేళలాకాపాడే నీ శరీరాన్ని
ఎందుకు నిర్లక్ష్యం చేస్తావు.

రోజూ ఒక గంట లేదా కనీసం అరగంట
నడక సాగిస్తావా యోగా చేస్తావా
జిమ్ కు వెళ్ళి ఎక్సర్సైజు చేస్తావా
ఆటలాడుతావా ఈత కొడతావా
ప్రశాంతంగా ధ్యానం చేస్తావా, నీ యిష్టం
ఇగ జెయ్యాలె అగజెయ్యాలె అని
వాయిదాలు వేయకు
మంచి పని చేయుటకు ముహూర్థాలెందుకు
ఇప్పుడే మొదలుపెట్టు
ఇనుప కండరాలు ఉక్కునరాలతో
దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించు .

-గిరిమాజి దామోదర్
9966336960

## తీరని దాహం కోరిక

కోరికలు కాలిపోను
కూర్చొనివ్వవు... నిలబడనియవవ్వ
మీసాల మీద
నిమ్మకాయలు
నిలబెట్టే నాకే
నిముషముకూడా
నిదురలేకుండా చేస్తున్నాయి

అంతులేని కోరికలు
శ్రమలేని బహుమతులు
జింక ను వేటాడాలని సింహమునకు కోరిక
సింహమును వేటాడాలని మనిషి కోరిక
మనిషిని వేటాడాలని ఆ భగవంతుని కోరిక
శ్రమదోపిడితో
సపాదించాలన్నది
వ్యాపారస్తుల కోరిక
మోసంచేసి గెలువాలన్నది
రాజకీయ నాయకుల కోరిక

కానిబిడ్డపై
స్వచ్ఛమైన మమకారం చూపే
తల్లీ ప్రేమ కోరికతో
నీవు ఓడిపోయావు
ఎందుకు
నా జీవితానికి
వచ్చావో తెలియదు

ఎందుకు
నేను
నీ వైపు
ఆకర్షితున్నయాన్నో
తెలియదు

కాని
నీ వల్లే
మనిషి మృగంగా మారుతున్నాడు
నీ వల్లే మనిషిగా మారుతున్నాడు

మనిషిగా గర్వపడాలా
మృగంగా బాధపడాలా
అన్నది మరో కోరిక
అందుకే
నా కోరిక
తీరని దాహం.



-డా.తెలుగు తిరుమలేష్
9908910398

## కన్నీటి ప్రవాహం

నాకు తెలిసి అమ్మ జీవితం
నీటి ప్రవాహం పుట్టక ముందే
వాళ్ళ నాన్న ప్రేమకు దూరం అయింది
పుట్టినప్పటి నుంచి కన్నీటిని తాగుతూ
కష్టాలను మింగుతూ పేదరికానికి వారసురాలిగా
సుఖసంతోషాలకు
ఆమడదూరంలో పెరిగి
వివాహమనే బంధంతో ముడిపడిన అమ్మ జీవితం
నాన్న ఇచ్చే సంతోషాలను స్వీకరిస్తూ
బాధలను అనుభవిస్తూ
అత్త అనే సూటిపోటి మాటలను తట్టుకుంటూ
తోటి కోడళ్ల ఈసడింపులు వింటూ
వంటింటికే పరిమితమైనది
అమ్మ జీవితం
కుటుంబ సంతోషంలోనే
తన ఆనందాన్ని వెతుకుంటూ
పిల్లల్ని పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేసి
అసలు కంటే వడ్డీ ముద్దని మనవడు మనవరాళ్ల
ముద్దు ముద్దు పలుకులను వింటూ
కాలం వెళ్లదీస్తుంది అమ్మ
అవసరాలు తీరాక కొడుకులు రెక్కలొచ్చి ఎగిరిపోతే
చేతగాని నాన్నకు సేవలు చేస్తూ
తన దీన స్థితికి రోదిస్తూ
ఆస్థినే కాదు అమ్మను కూడా పంచుకున్న
కొడుకులను చూసి ఏడ్వలేక నవ్వుతూ బ్రతకుతుంటే
అయినా కసి తీరని కొడుకులు
అమ్మను ఒంటరిదాన్ని చేస్తే నిల్వ నీడ లేక
అమ్మ చెట్లు పుట్టల చుట్టు తిరుగుతూ
కాలం వెళ్లదీస్తుంది..

-అనిత దావత్
9394221927

## గూటికి చేరిన పిచ్చుక

విశాలమైన ప్రపంచం
ఎక్కడ చూసినా
ఎడారి ఇసుక తిన్నెలుపై కాపురాలు
మట్టిని చీల్చే శక్తిలేని విత్తు మొలకలు
ఆకు రాల్చిన కొమ్మలతో
నిలువునా చీలికలైన వృక్ష సమూహాలు
నిలువెత్తు చెట్ల స్థానంలో
ఇనుప చువ్వలతో నిర్మించిన టవర్లు
ఖళీ దేహాన్ని
అవలీలగా గాలిలో లేపి
సత్తువ లేని రెక్కలు తటపటలాడిస్తూ
ఆహారన్వేషణలో పిచ్చుక
పంట పొలాలు బంగ్లాలై
లేచి కూర్చున్నాయి
చిక్కటి పొదల నేల ఇప్పుడు
నల్లని తారు వళ్ళంతా పరుచుకొని
నున్నటి దారిలా మారిపోయింది
ముసురుకున్న కలుపు మొక్కల మధ్యలో
బిక్కు బిక్కుమంటూ బీడు భూమి
రేడియేషన్ ప్రకంపనలతో పిచ్చుక
ప్రాణం ఎండిన గొంతుకలో దాచి
గూటికి చేరి మూలన ఒదిగింది

-నరెడ్డుల రాజారెడ్డి
9866500305

## వసుధ

చరాచర సృష్టిని మోస్తూనే
ప్రకృతి అందాలను తనలో దాస్తుంది
సకల ప్రాణుల కు నిలయం వసుధ

జీవన మనుగడకు కేంద్రబిందువౌతూనే
జీవవైవిద్యానికి మూలమౌతోంది
సర్వజనులకు ఆధారం వసుధ

ప్రకృతి శోభలతో అలరారుతూనే
ప్రాణకోటికి జీవనాధారమైనది
బంగరు పంటలకు దివ్య క్షేత్రం వసుధ

సర్వ కళలకు ఆలవాలమై విరాజిల్లుతూనే
భిన్నత్వంలో ఏకత్వం సాధింపచేస్తోంది
విభిన్న సంస్కృతులకు దర్పణం వసుధ

భూతల స్వర్గంగా పేరొందుతూనే
భూమి పుత్రులను దీవిస్తోంది
భుక్తి -ముక్తి ప్రదాయని వసుధ

వేదపురాణ ఇతిహాసాలకు ఆలవాలమై
హైందవ జాతి సంస్కృతికి అద్దం పడుతోంది
వెలుగులు చిందించేటి ఈ వసుధ
-(అంతర్జాతీయ ధాత్రి దినోత్సవం సందర్భంగా )

-కె. శైలజా శ్రీనివాస్
చరవాణి :8019736254

## ధాత్రి

విశ్వ మానవాళిని ఆనందింపచేస్తూ
పచ్చని శోభలతో నయానంద కరం చేస్తుంది
పుడమి తల్లి కడు శోభనీయమైనది.
మానవుడు తన స్వార్ధం కోసం చెట్లు నరికేస్తూ
తన గొయ్యి తన తవ్వుకుంటున్నాడు
ప్రకృతిని పరిరక్షిస్తూ మనం హాయిగాజీవిద్దాం.
ఆధునికత పేరుతో చెట్లను నరికేస్తూ
మానవులుభూసారం తగ్గించి వేస్తున్నారు.
ధరణిని కాపాడాలసిన బాధ్యత గుర్తిద్దాం.
ప్రతి ప్రాణికి ఆహారాన్ని సృష్టించే తల్లిగా
సకల జనులను కంటికి రెప్పలాపోషిస్తోంది
అవని అమ్మలా మనల్ని ఆదుకుంటోంది.
మనం చేసే తప్పిదాలను సరిదిద్దుకొంటూ
భూమాతను ఎల్లవేళలా కాపాడుకుందాం
ప్రకృతి వైపరీత్యాలనుపూర్తిగాఅరికడదాం.



- సి. హెచ్. శ్రీనివాసరావు
9291287085

